సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ఆలయ భూములకు రక్షణ

ఆలయ భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. 8లో▸



బకాయిలు చెల్లించండి

నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు, సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. 8లో▸



నష్టపరిహారం చెల్లించాలి

మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలని టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. 8లో▸

సభకు సర్వం సిద్ధం

నేడు చేవెళ్లలో కాంగ్రెస్ బహిరంగ సభ

- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు
- అన్ని జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, పోలీసు అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీకి, చేవెళ్లకు విడదీయరాని బంధం ఉంది. పార్టీ కార్యక్రమమైనా.. అధికారిక కార్యక్రమమైనా ఇదే వేదిక నుంచి ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో దివంగత నేత వైఎస్సార్ తన పాదయాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించారు. తర్వాత జలయజ్ఞం కార్యక్రమానికి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. ఎన్నికలకు ముందు ఎస్సీ డిక్లరేషన్ సైతం ఇదే వేదికగా నిర్వహించారు. తాజాగా ఆరు గ్యారంటీల్లో భాగంగా మరో రెండు (రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ సరఫరా) పథకాలను ఇదే వేదికగా ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా చివరి నిమిషంలో వేదికను సచివాలయానికి మార్చారు. చేవెళ్లలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఫరా ఇంజనీరింగ్ కాలేజీలో భారీ సభ నిర్వహిస్తున్నారు. అధికారిక కార్యక్రమం కావడంతో కలెక్టర్ శశాంక సహా సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులంతా సభకు హాజరు కానుండటంతో భారీ ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు ఇలా..

- ఫరా కళాశాల వద్ద బహిరంగ సభ స్థలంలో ప్రజల కోసం మూడు షెడ్లతో గ్యాలరీలు, సభావేదిక పనులు పూర్తి చేస్తున్నారు.
- సభా వేదిక వెనుక భాగంలో ముఖ్యఅతిథులు వచ్చేందుకు అధికారులు రెండు హెలీప్యాడ్‌లను సిద్ధం చేసి ఉంచారు.
- రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మహిళలను ఈ సభకు తరలిస్తున్నారు. డీఆర్‌డీఓ అధికారుల ఆధ్వర్యంలో డ్వాక్రామహిళా సంఘాల సభ్యులు ఈ పథకాల లబ్ధిదారులను సభకు తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.
- దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.
- ప్రత్యేకంగా మహిళలు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో వారికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు.
- ఇతర జిల్లాల నుంచి వచ్చే మహిళలు బస్సులు దిగిన వెంటనే సభావేదిక వద్దకు చేరుకునేలా సభావేదిక సమీపంలోనే పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు.
- జిల్లాల వారీగా బోర్డులు పెట్టి బస్సులు పార్క్ చేసి.. తిరిగి సభ అనంతరం వెళ్లేందుకు సౌలభ్యంగా ఉండేలా చూస్తున్నారు.
- వచ్చిన మహిళలకు గ్యాలరీల్లోనే నీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు.
- మంత్రులు, ఉన్నతాధికారులు హాజరవుతున్న నేపథ్యంలో వీఐపీ గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు.
- శాఖలవారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించి సభను విజయవంతం చేసేలా చేస్తున్నారు.



సిద్ధమవుతున్న సభా వేదిక

మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9.30 గంటల వరకు పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నుంచి వికారాబాద్ వైపు వెళ్లే వాహనాలను అప్పా జంక్షన్, శంకర్‌పల్లి మీదుగా మళ్లించనున్నారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాలను ఆలూరు నుంచి ప్రగతి రిసార్ట్స్ మీదుగా అప్పా జంక్షన్ వైపు మళ్లించనున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

భారీ పోలీస్ బందోబస్తు

బహిరంగ సభ నేపథ్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ముగ్గురు డీసీపీలు, తొమ్మిదిమంది ఏసీపీలు, 37 మంది సీఐలు, 109 మంది ఎస్ఐలు, 800 మంది పీసీలు, 300 మంది ట్రాఫిక్ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

సమన్వయంతో పని చేయాలి

చేవెళ్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమం నేపథ్యంలో అధికారులంతా సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ శశాంక సూచించారు. ఈ మేరకు సోమవారం ఫరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జిల్లా అధికారులతో సమీక్షించారు. సీఎం మంగళవారం సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో చేవెళ్లకు చేరుకుంటారని తెలిపారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. అనంతరం ఆయన హెలిప్యాడ్, వేదిక, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ రంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'కోడ్'తో వేదిక మార్పు..

ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్, కోడ్ కారణంగా చేవెళ్లలో ప్రారంభించాల్సిన రెండు గ్యారంటీలను సచివాలయానికి మార్పు చేశారు. చేవెళ్ల సెంటిమెంట్‌లో భాగంగా ఇక్కడి నుంచే రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలను మంగళవారం మధ్యాహ్నం చేవెళ్ల వేదికగా ఏఐసీసీ నేత ప్రియాంక గాంధీ వర్చువల్‌గా ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. కోడ్ నేపథ్యంలో కేవలం బహిరంగ సభ మాత్రమే నిర్వహించనున్నారు.

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 82 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందిస్తూ పరిష్కరించాలని తెలిపారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివరాల నమోదుకు రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

షాద్‌నగర్ స్టేషన్‌లో ప్రగతి పనులు షురూ

షాద్‌నగర్: అమృత్ భారత్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ సోమవారం వర్చువల్‌గా రైల్వే స్టేషన్‌లో ప్రగతి పనులు ప్రారంభించారు. షాద్‌నగర్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు కేంద్రం రూ.9.59 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. అవసరం లేకున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మానం చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. చటాన్‌పల్లి రైల్వే బ్రిడ్జి మొదటి నమూనాను కొందరు సొంత ప్రయోజనాల కోసం డిజైన్‌లో మార్పులు చేశారని విమర్శించారు. రైల్వే ట్రాక్ కింద అంతర్గతంగా రహదారులు నిర్మిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని, వర్షాకాలంలో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మొదటి నమూనాను అమలు చేసేలా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో మాట్లాడతానని చెప్పారు. రైల్వేస్టేషన్ సమీపంలోని రతన్ కాలనీకి వెళ్లే రహదారిని మూసివేస్తూ ప్రహరీ నిర్మించడం సరి కాదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైల్వే అధికారులు ఆలోచించి పరిష్కార మార్గం చూపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా పాల్గొన్నారు.

మరకత శివలింగ దర్శనం పూర్వ జన్మసుకృతం

సినీనటి షెరాన్ లోవెన్

శంకర్‌పల్లి: చందిప్ప మరకత శివాలయాన్ని దర్శించుకోవడం పూర్వ జన్మసుకృతమని సినీనటి షెరాన్ లోవెన్ అన్నారు. సోమవారం మండల పరిధిలో మోకిల మరకత శివాలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సదానందం గౌడ్, సభ్యులు దయాకర్ రాజు ఉన్నారు.

నిధులు పక్కదారి.. ఎవరో సూత్రధారి!

- రైతుబంధు, రైతుబీమా సొమ్ము కాజేసిన వ్యవసాయ విస్తరణాధికారి
- నకిలీ ధ్రువపత్రాలతో రూ.2 కోట్ల వరకు స్వాహా
- కుటుంబసభ్యుల పేరిట భూముల కొనుగోళ్లు
- ఏఈఓ వెనుక ఉన్నతాధికారులు, నాయకుల హస్తం ఉండొచ్చని అనుమానాలు

కొందుర్గు: దాదాపు రూ.రెండు కోట్ల రైతుబంధు, రైతుబీమా నిధులు దారిమళ్లించిన ఏఈఓ శ్రీశైలం సదరు డబ్బులతో వ్యవసాయ భూములు కొనుగోలు చేశాడని తెలుస్తోంది. మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉమ్మెంత్యాల రోడ్డులో 9 ఎకరాల భూమిని ఆయన కుటుంబ సభ్యుల పేరున కొనుగోలు చేశారని, విశ్వనాథ్‌పూర్‌లో మరో రెండెకరాలు కొనుగోలు చేశారని స్థానికంగా చర్చ సాగుతోంది. అప్పుచేసి భూమి కొనుగోలు చేశానని నమ్మించడం కోసం తాను కొనుగోలు చేసిన భూమిని షాద్‌నగర్ పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో తనఖా పెట్టి రుణం తీసుకున్నట్లు సమాచారం. భూమిలేని రైతుల వివరాలు, స్థానికంగా నివాసం లేకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే రైతుల డేటాను ఎంపికచేసుకొని వారి పేర్లపై నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రైతుబంధు, రైతుబీమా డబ్బులు తెలివిగా కాజేసిన శ్రీశైలం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నతాధికారులు, నాయకుల హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరణ ధ్రువపత్రాలను తెలివిగా ఎడిట్ చేయడం వెనుక ఉన్నతాధికారుల సహకారం ఉండొచ్చని భావిస్తున్నారు. ఏఈఓలు అప్‌డేట్ చేసిన ధ్రువపత్రాలను ఉన్నతాధికారులు ధ్రువీకరించకుండా ఎలా నిధులు మంజూరవుతాయన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు నిజాలు బయటికి వస్తాయని అంటున్నారు.



ఏఈఓ కుటుంబ సభ్యుల పేరిట కొనుగోలు చేసిన భూమి

ఏఈఓతోపాటు మరొకరి అరెస్టు..


గచ్చిబౌలి: రైతుబంధు, రైతుబీమా సొమ్ము కాజేసిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. గచ్చిబౌలిలోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. కొందుర్గు మండలానికి చెందిన వ్యవసాయ విస్తరణాధికారి గోరెటి శ్రీశైలం (41) మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రైతుల పంటల వివరాలు సేకరిస్తాడు. సీసీఎల్ఏ రైతుబీమా పోర్టల్ నుంచి వివరాలు సేకరించి 60 ఏళ్లు దాటిన, ఇప్పటికే మరణించిన వారి పేరిట నకిలీ డాక్యుమెంట్లతో రైతుబీమాకు దరఖాస్తు చేశాడు. ఎల్ఐసీ నుంచి వచ్చే మెసేజ్‌ల కోసం ప్రత్యేక సిమ్‌కార్డును ఉపయోగించాడు. 20 మంది పేరిట ఏడు అకౌంట్లలోకి రూ.కోటి మళ్లించాడు. నకిలీ మరణ ధ్రువపత్రాలతో అటు ప్రభుత్వాన్ని ఇటు ఎల్ఐసీని బురిడీ కొట్టించాడు. అలాగే పట్టాదార్ పాస్‌బుక్ నంబర్లను ఉపయోగించి అమాయక రైతుల పేరిట రైతుబంధు స్వాహా చేశాడు. తన సహాయకుడు ఓదేల వీరస్వామి (47)తో కలిసి రైతులను నమ్మించి పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులు సేకరించాడు. 130 మంది రైతుల పేరిట సుమారు రూ.కోటి రైతుబంధు నిధులను 50 అకౌంట్లలోకి మళ్లించాడు. కాజేసిన డబ్బుతో కొందుర్గులో 2.35 ఎకరాల వ్యవసాయ భూమిని, తుమ్మలపల్లిలో 8.20 ఎకరాల వ్యవసాయ భూమి, కడ్తాల్‌లో 183 చదరపు గజాల ప్లాట్‌ను కొనుగోలు చేశాడు. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారి కొందుర్గు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొందుర్గు ఠాణా నుంచి కేసును ఈఓడబ్ల్యూకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో ఏఈఓ శ్రీశైలం, ఓదేల వీరస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, నేషనల్ బ్యాంకులకు చెందిన 7 డెబిట్ కార్డులు, ఫోర్జరీ చేసిన డెత్ సర్టిఫికెట్లు, ఎల్ఐసీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఏఈఓ శ్రీశైలం భార్య మహేశ్వరికి ఈ కేసులో ప్రమేయం ఉందని సీపీ వివరించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి బాధ్యులందరినీ అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఏఈఓ శ్రీశైలంపై ఏసీబీ కేసు నమోదు చేస్తుందన్నారు. సమావేశంలో ఈఓడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి








జన్మదిన శుభాకాంక్షలు

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండలానికి చెందిన భీమేందర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలో నిర్వహించిన వేడుకలకు తన అనుచరులతో కలిసివెళ్లారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

– మొయినాబాద్ రూరల్



'కారు' దిగి.. కాంగ్రెస్‌లో చేరి..

మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సోమవారం గాంధీ భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో 26 మంది లబ్ధిదారులకు మంజూరైన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీలో ఇప్పటికే రెండు పథకాలు అమలు చేస్తుండగా మంగళవారం నుంచి మరో రెండింటిని అమలు చేయనున్నట్లు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినా.. సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహ యాదవ్, హరినాథ్ రెడ్డి, నందిగామ, చేగూరు పీఏసీఎస్ చైర్మన్‌లు రాజ్ గోపాల్, అశోక్, తహసీల్దార్ రాజేశ్వర్, నాయకులు బాల్‌రెడ్డి, రాంరెడ్డి, లింగం, కాట్న సురేందర్, మాజీ సర్పంచ్ పాండు రంగారెడ్డి, పసుల బుచ్చయ్య, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణకు చర్యలు

దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

కడ్తాల్: దేవాలయ భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ అన్నారు. మండలకేంద్రంలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి సంబంధించి సర్వేనంబర్ 130లో ఇటీవల దేవాదాయ, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ఆలయ భూమిలో అక్రమంగా వేసిన రహదారిని తొలగించడంతో పాటు కంచె ఏర్పాటు పనులు చేపట్టారు. రెండు రోజుల క్రితం కంచె ఏర్పాటు చేస్తున్న సందర్భంలో అన్మాస్‌పల్లి, శాయిరెడ్డి గూడెం గ్రామాలకు చెందిన కొంత మంది నాయకులు పనులు నిలిపివేయించారు. అన్మాస్‌పల్లికి చెందిన రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు దారి లేదని, ఆలయ భూమిలో కొంత మేర దారి కోసం విడిచిపెట్టాలని కోరారు. శాయిరెడ్డి గూడెం గ్రామానికి రాకపోకలు సాగేందుకు ఆలయ భూమిలో రహదారి ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పనులను అడ్డుకున్నారు. విషయాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, జిల్లా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో పాటు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం దేవాలయ భూముల పరిరక్షణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఎండోమెంట్ తహసీల్దార్ గిరిధర్, ఈవో మోహన్‌రావు తదితరులు అన్మాస్‌పల్లి గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ఆలయ భూమిని ఎవరికీ విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. కంచె ఏర్పాటు పనులు పూర్తి చేయించి, ఆలయ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం పోచమ్మ గడ్డతండా సమీపంలోని సర్వే నంబర్ 120లో ఆక్రమణకు గురైన దేవాలయ భూమిని, మండల కేంద్రంలోని సర్వే నంబర్ 76లో విలువైన 6.05 ఎకరాల ఆలయ భూమిని పరిశీలించారు. ఆలయ భూములు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయులు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, దేవాదాయ శాఖ అధికారులు కృష్ణగౌడ్, బోడ్యానాయక్, ఆంజనేయులు, నాయకులు భాస్కర్‌రెడ్డి, శాయిరెడ్డి, యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్ శంకర్, ఎగిరిశెట్టి బాబు, బీక్యానాయక్, జగన్, రాంచందర్, కేశవులు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఆలయ భూములకు కంచె ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

కొత్తిమీరు.. కంటనీరు!

- ధర పడిపోవడంతో దిక్కుతోచని రైతులు
- కూలీల డబ్బులు, ఆటో కిరాయిలు రావడం లేదని ఆవేదన

మొయినాబాద్ రూరల్: కొత్తిమీర ధర పూర్తిగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్లో పెద్ద సైజు కట్టకు (250 గ్రాములకు పైగా) రూ.2 నుంచి రూ.3 పలుకుతోంది. దీంతో కూలీల ఖర్చులు కూడా రాని దుస్థితి నెలకొంది. చేవెళ్ల నియోజకవర్గం దామరగిద్ద గ్రామానికి చెందిన రైతు శేఖర్ తాను పండించిన కొత్తిమీర పంటను మంగళవారం ఉదయం కొత్తపేట మార్కెట్‌కు తరలించాడు. సుమారు వంద బాక్సులు లోడ్ చేసుకుని ఆటోలో వెళ్లాడు. ఒక్కో బాక్సును రూ.150 చొప్పున సుమారు 20 బాక్సులు విక్రయించాడు. మిగిలినది ఎవరూ తీసుకోకపోవడంతో కనకమామిడి సమీపంలోని జాతీయ రహదారి పక్కన పడేశాడు. ఈ సందర్భంగా 'సాక్షి' అతన్ని పలకరించగా తీవ్ర ఆవేదన వ్యక్తంచేశాడు. పంట సాగు కోసం ఎకరాకు రూ.30 వేల వరకు ఖర్చుచేశానని, ధర లేకపోవడంతో నిండా మునిగానని వాపోయాడు. రూ.30 నుంచి రూ.40 వరకు పలకాల్సిన ఒక్కో కట్టకు రూ.2 కూడా రాలేదని తెలిపాడు.



కొత్తిమీరను రహదారి పక్కన పడేస్తున్న రైతు

తాళం వేసిన ఇంటికి కన్నం

15 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు అపహరణ

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణ కేంద్రంలోని బ్లూడ్స్ కాలనీలో వెలుగుచూసింది. సోమవారం సీఐ వినాయకరెడ్డి తెలిపిన ప్రకారం.. కాలనీ వాసి సునీల్ ఈ నెల 22న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మెయినాబాద్ వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. 25న రాత్రి ఇంటికి వచ్చిన సునీల్ తాళం పగులగొట్టడంతో పాటుగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడిఉండడంతో ఆదివారం రాత్రి శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బకాయి వేతనాలు చెల్లించండి

- పంచాయతీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీ కార్మికులు, సిబ్బందికి నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని పంచాయతీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట యూనియన్ జిల్లా అధ్యక్షుడు అలువాల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ.. ఎన్నికలకంటే ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను పస్తులుంచుతోందని విమర్శించారు. మల్టీ పర్పస్ వర్కర్స్ పేరుతో మూడు, నాలుగు, ఐదు వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులకు రూ.18వేల వేతనం ఇవ్వాలని కోరారు. తక్షణం నిధులు విడుదల చేసి వేతనాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు మాట్లాడుతూ.. కార్మికుల మీద ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని మండిపడ్డారు. 558 పంచాయతీల్లో పని చేస్తున్న 6,030 మందికి వేతనం చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, నాయకులు నర్సింహ, శేఖర్, సీహెచ్ బుగ్గరాములు, అశోక్, జయమ్మ, భారత మ్మ, సుకునమ్మ, కారోబార్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

Real Estate

FLAT FOR SALE

■ ఉప్పల్ బగాయత్ నాగోల్ Metro Station దగ్గరలో 3 BHK Flats 1630, 1740 Sq. Feets New Construction అమ్మకానికి కలవు. ఫోన్: 9121355295 / 8096103648. [H-799758]

■ నాచారం మానిక్‌చంద్ రోడ్‌లో 2 BHK, 3 BHK Flats అమ్మకానికి కలవు Ready to Occupy Per Sq. Feet 5100/- ఫోన్: 6301867563 / 9603061171. [H-799757]

■ Mallapur, Near Nacharam, Habsiguda 3 BHK Premium Flats For Resale Gated Community, Club House, Ready to Occupy. Brand New Call: 8069045555. [H-787944]

■ Affordable 2 BHK Flats Near India's Largest BIO-TECH HUB, Genom Valley Great Investment For Rent. Possession In 6 Months. Call: 8069045563. [H-787945]

LAND FOR SALE

■ నారాయణఖేడ్ దగ్గరలో 1 గుంట భూమి 1.2 లక్షలకి, 5 గుంటలు 5 లక్షలు మాత్రమే, 1 ఎకరానికి 19.9 లక్షలు భూమి అమ్మకానికి కలదు + మార్కెటింగ్ టీం కావలెను. ఫోన్: 6304614531. [H-787929]

PLOT FOR SALE

■ యాదగిరిగుట్ట, వంగపల్లి దగ్గరలో DTCP ఫామ్ Plots అమ్మకమునకు కలదు. తక్కువ ధరలలో అమ్మబడును. ఫోన్: 8096279991/8179212346. [H-799759]

■ నాదర్‌గుల్ MVSR కాలేజ్ దగ్గరలో 150 గజములు Plot అమ్మకానికి కలదు. సంప్ర: 6301867563 / 9603061171. [H-799756]

■ షాద్ నగర్ మున్సిపల్ పరిధిలో గజం 15999/- వేలకే HMDA, APPROVED తో ఇల్లు కట్టుకోవడానికి రెడీగా ప్లాట్స్ కలవు. మార్కెటింగ్ టీం కావలెను. ఫోన్: 9030591797. [H-787928]

■ హైదరాబాద్ నుండి నర్సాపూర్ హైవేలో కొడిపల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ ఫార్మ్ ల్యాండ్‌లో గజం కేవలం 3 వేలకే స్పాట్ రిజిస్ట్రేషన్ చేయబడును. మార్కెటింగ్ టీం కావలెను. 9030591797. [H-787939]

■ బెంగుళూరు హైవే కొత్తూరు (నందిగామ) దగ్గర హైవేకి అతి సమీపంలో HMDA అప్రూవల్ గల రన్నింగ్ వెంచర్‌లో ప్లాట్స్ 80% బ్యాంక్‌లోన్ కలదు. సంప్ర: 77998 93899 [G-3131]

■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 6 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న మాజీవీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ ప్లాట్స్ చ॥గు॥ 1,900/- నుండి 16,500/- సంప్ర : 97033 13505 [B-220]

Services

■ లీగల్ & డిటెక్టివ్ సర్వీసెస్: సివిల్, క్రిమినల్, ఫ్యామిలీ, ప్రాపర్టీ, డైవోర్స్, హై కోర్ట్, సుప్రీమ్ కోర్ట్ పెండింగ్ కేసుల ఫాస్ట్ సెటిల్‌మెంట్ కొరకు అడ్వకేట్ శ్రీనివాస రామ చంద్ర రెడ్డి, ఫోన్: 9676094111 [HA-1269]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-801583]

HOME NEEDS

PEST CONTROL

■ 9550446581 చెదలు, బొద్దింకలు కొత్త ఇంటికి కెమికల్ ట్రీట్‌మెంట్ డోర్స్, విండోస్, కబోర్డ్స్ పౌడర్ రాలుట, 5 సం.ల గ్యారంటీ. ఫోన్: 9666566081 [HA-96696]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Nandimandalam Thanay S/o N Ramesh Raju R/o Flat No 102, Sree Sai Sridevi Nilayam, Sree Balaji Nagar, HMT Swarnapuri Colony, Miyapur, Hyderabad, Telangana - 500049 have changed my name to N Thanay Raju. [DA-32628]

■ I, Sushil Kumar, R/o Flat No-B6-911, My Home Mangala, Kondapur, K.V.Rangareddy, TS. my son's name has changed From Harsh Vardhan to Harsh Vardhan Singh. [HA-31593]

■ I, Saketh Dhatrak S/o Venkat Dhatrak, R/o Jeedimetla Village, have changed my Name from (Old Name) Saketh Dhatrak to (New Name) Saaketh V Dhatrak for all record purpose. [HA-96716]

OLD AGE HOME

■ నారీ వృద్ధుల కోసం మరియు భార్యాభర్తల కోసం 24 గం. A/C & N/C గదులు అటాచ్ బాత్‌రూమ్ ఫర్నీచర్‌తో మేడిపల్లి హైవే ఉప్పల్ & Ecil. 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 9515474083 / 9700006699. [H-788146]

WATER PROOFING

■ శ్రీ సాయి భవాని వాటర్ ప్రూఫింగ్: టెర్రస్, సీలింగ్, సైడ్ వాల్స్, క్రాక్ ఫిల్లింగ్, వాటర్ ట్యాంక్, సంప్, బాత్‌రూమ్స్ ఎటువంటి లీకేజ్ అయిన కెమికల్స్ చే 10 సం॥ల గ్యారెంటీతో చేయబడును. ఫోన్: 9948270898. [H-801537]

TOURS & TRAVELS

■ సాయి టూర్స్: FEB 22 కేరళ టూర్, Mar 2 రామేశ్వరం, కన్యాకుమారి, మదురై MAR 27 ఉజ్జయిని ద్వారక, APR 10 కర్ణాటక టూర్, ఏప్రిల్ 18 MH షిరిడీ, అష్టవినాయకులు, భీమశంకర్. 9848664831 [HA-10852]

Wanted

■ రిసెప్షనిస్ట్, టెలికాలర్, విలేకర్లు, వీడియో ఎడిటర్లు, కలెక్షన్స్, DTP, డ్రైవర్లు, కుక్స్, సూ॥ వైజర్, హెల్పర్స్ జీ॥ 15-18k, ఫ్రీ హాస్టల్ @ 9505288777, ఉప్పల్, కొంపల్లి. [H-801672]

■ అర్జెంటుగా సెక్యూరిటి గార్డ్స్ షాద్‌నగర్, KPHB, బాచుపల్లి, IDA బొల్లారం, పటాన్ చెరువు, తార్నాక, AS రావ్ నగర్, ECIL. జీ. 12-15k + రూమ్, కూచారం. ఫోన్: 9492883231 [HA-13068]

■ కావలెను: జీతం నెలకు 30-60K (టార్గెట్ బేస్ శాలరీ) Q: any పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ at ur ఏరియా off/online Wts up: 8500756521 [HA-1268]

■ హోలిడేమరినా రిసార్ట్స్‌లో అనుభవం ఉన్న హౌస్‌కీపింగ్ భార్య/భర్తలు కావలెను. వ:35 సం॥లోపు, జీతం + అకామిడేషన్. @ షాద్ నగర్. 8309388989 [HA-2133]

■ బేబీకేర్, పేషెంట్‌కేర్, ఇంటి పని, వంట పని చేయుటకు అర్జెంటుగా కావలెను. జీతం: 15,000/- - 30,000/-, రూం, మీల్స్ ఫ్రీ. 24/7, 8Hrs. ఫోన్: 9391977517, 7569262545 [HA-31591]

■ Hyd సంఘీ టెంపుల్‌లో సె॥గార్డ్ -12 గం.- జీ.19000, సె॥సూ॥వైజర్ - 12 గం.- జీ: 23000, LB నగర్, కొత్తపేట్,DSNR ఏరియాలో హౌ॥కీ॥బాయ్స్ 9 గం॥ - జీ: 13000 కావలెను. ఫోన్: 9666215759 [H-787802]

■ నాగోల్ బండ్లగూడలోని అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మెన్, డ్రైవర్ ఫ్యామిలీ అర్జెంట్‌గా కావలెను. మంచి జీతం, వసతి కలదు సంప్ర: 9391342022/ 9866250815 [H-799906]

■ గచ్చిబౌలి, మాదాపూర్, ఘట్‌కేసర్ ఏరియాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు, ఆఫీస్ బాయ్స్, హౌస్ కీపింగ్ స్త్రీలు / పురుషులు కావలెను. మంచి జీతం+ESI+PF ఫోన్: 8639110999/9398915299. [HA-13060]

■ పూజిత హోంకేర్: పేషెంట్లు, బేబీకేర్, ఇంటి / వంట పని చేయుటకు స్త్రీలు, పురుషులు, కేర్ టేకర్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ. జీతం: 15-20 వేలు. ఫోన్: 8801821210. [H-793586]

■ Hormann Doors for Home and Industry Requires Building Materials, Experienced Marketing Executives to Market Work. Cell : 98850 00541, 98850 00832. [NA-10494]

■ Wanted Telecallers and Marketing Executives (Freshers & Exp). Good Salary AnandBagh, Malkajgiri SS Finance. PH: 8885057734/36 [H-804751]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-1091, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

శంకర్‌పల్లి: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధించడం ఖాయమని వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పట్నం సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ మోకిల గ్రామ అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, భిక్షపతి, శ్రీనివాస్, నర్సింలు, ఎండి ఆజాం, ఎండి ఖాజా, రాములు, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు నాలుగు స్వర్ణాలు

సాక్షి, సిటీబ్యూరో: న్యూఢిల్లీలోని ఐజీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరుగుతున్న 43వ సీనియర్, 30వ జూనియర్ ఏషియన్ ట్రాక్, 12వ పారా ట్రాక్ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగో రోజు భారత క్రీడాకారులు నాలుగు బంగారు పతకాలు, ఒక రజతం, కాంస్య పతకాలు సాధించారు. ఇందులో భాగంగా అర్షద్ షేక్ మూడు కిలోమీటర్ల పర్స్యూట్, ఓన్మియమ్‌లో రెండు బంగారు పతకాలను గెలుపొందారు. మూడు కిలోమీటర్ల పర్స్యూట్, ఓన్మియంలో మరో రెండు గోల్డ్ మెడల్స్‌ను జ్యోతి గదేరియా సాధించారు. ఆర్యవర్ధన్ మూడు కిలోమీటర్ల పర్స్యూట్‌లో రజతం, ఓన్మియంలో పవన్ కుమార్ కాంస్య పతకాలను సాధించారు. ఈ పతకాలతో ఇప్పటివరకు భారత్ సాధించిన పతకాలు 16కు చేరాయి.

మత్స్యకారులకు పరిహారం చెల్లించాలి



నాగులమ్మ చెరువులో చనిపోయిన చేపలను పరిశీలిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

- టీఎంకేఎంకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ
- నాగులమ్మ చెరువులో మృత్యువాతపడిన చేపల పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ మత్స్యకార కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామం నాగులమ్మ చెరువులో రెండు రోజులుగా రూ.10లక్షల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న టీఎంకేఎంకేఎస్ నాయకులు సోమవారం చెరువును సందర్శించారు. చనిపోయిన చేపలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. చేపలు మృత్యువాతపడడానికి కారణాలను తెలుసుకునేందుకు చెరువు నీటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయాలని కోరారు. ఈ చెరువుపై ఆధారపడి వంద కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. చేపల చనిపోవడంతో తాము వృత్తిని కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యశాఖ అధికారులు చెరువును సందర్శించి ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు భిక్షపతి, ఉపాధ్యక్షుడు బత్తెం భిక్షపతి, మాజీ కార్యదర్శి కావలి నర్సింహ ,కట్టెల ఆనంద్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. కన్హా శాంతివనం

- 14నుంచి 17వరకు 'ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ్'
- కేంద్ర న్యాయ, సాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనం అద్భుతంగా ఉందని కేంద్ర న్యాయ, స్కాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ అన్నారు. మండలంలోని కన్హా శాంతి వనాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. మార్చి14 నుంచి 17 వరకు కన్హాలో 'ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ్' వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ విషయమై కోర్ కమిటీ సభ్యులతో చర్చించినట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక సంబరాలకు శాంతివనం అనుకూలంగా ఉందని తెలిపారు.



కోర్ కమిటీ సభ్యులతో కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

స్విఫ్ట్‌ను ఢీకొట్టిన తుఫాన్

- ఒకరి మృతి
- పలువురికి గాయాలు

మంచాల: అతివేగం ఒకరి ప్రాణాలు తీయగా.. పలువురు గాయపడ్డారు. ఈ దుర్ఘటన మండల పరిధిలోని ఆగాపల్లి గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మంచాల సీఐ బాబ్యు నాయక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వంగూరి ఎర్రేశ్(40) వ్యవసాయ కూలీ. ఆయన ఇబ్రహీంపట్నం నుంచి స్విఫ్ట్ కారులో స్వగ్రామం ఆగాపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో మాల్ నుంచి ఇబ్రహీంపట్నం వైపు ప్రయాణిస్తున్న తుఫాన్ ఎదురుగా వస్తున్న స్విఫ్ట్‌ను వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ నడుపుతున్న ఎర్రేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తుఫాన్‌లో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు. తుఫాన్‌లో మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న విమల, శారద, బాలనర్సింహ, శేఖర్‌రెడ్డితోపాటు మరో పది మంది ప్రయాణికులున్నారు. ఎర్రేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఏడాది వయసున్న కుమారుడు న్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.



ఎర్రేశ్ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు: పట్టణంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఆమనగల్లు ఎస్ఐ బలరాం తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన నర్సింహ, యాదయ్య బైక్‌పై ఆదివారం ఆమనగల్లుకు వచ్చారు. తిరుగుప్రయాణంలో పెట్రోలు కోసం బంక్ వద్దకు వెళ్తుండగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ, యాదయ్యలు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నర్సింహ భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వ్యక్తి అదృశ్యం



హరికృష్ణ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: గుడికి వెళ్తున్నానంటూ బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన ప్రకారం... తారమతిపేట గ్రామానికి చెందిన దుబ్బ హరికృష్ణ (36) ఈ నెల 22న గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్రామంలోని బీరప్ప గుడికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో గ్రామ పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య హేమలత సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా అదృశ్యమైన వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని, 20 రోజుల క్రితం ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స అందించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

గ్యారంటీల అమలు పక్కా



మాట్లాడుతున్న జ్యోతి

షాబాద్: ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో మహిళ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ సత్తాచాటుతుందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో పాలకులు అభివృద్ధిని మరిచారని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షురాలు అశ్విని, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, యాదయ్య, బాల్‌రాజ్, వెంకట్రాంరెడ్డి, చారి, నవీన్, రాములు, మహేశ్, రాంచంద్రయ్య, శంకరయ్య, యాదయ్య, చిచ్చప్పయ్య, తదితరులున్నారు.

'ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరిస్తున్నాం'

రాజేంద్రనగర్: ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ వెల్లడించారు. జీహెచ్ఎంసీ విభాగంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల్ బుద్వేల్ సర్వే నంబర్ 424లోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఉదయం రెవెన్యూ అధికారులు బుద్వేల్ ప్రాంతానికి చేరుకొని నాలుగు కట్టడాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. కూల్చివేతల నేపథ్యంలో రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ..ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఎలాంటి నిర్మాణాలైనా కూల్చివేస్తామని హెచ్చరించారు.

ట్రాఫికర్

అడ్డా కూలీలతో రోజు భారీగా ట్రాఫిక్ జామ్

- అడ్డా మార్చినా అక్కడికి వెళ్లని కూలీలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ సిబ్బంది



కాళీమందిర్ చౌరస్తాలో రోడ్డుపైనే అడ్డా కూలీలు

బండ్లగూడ: కాళీమందిర్ చౌరస్తా నుంచి ఉదయం వేళల్లో హైదరాబాద్, చేవెళ్ల, పర్గి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు రోడ్డుపై అడ్డా కూలీలతో ఇబ్బందిగా మారుతోంది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో వారి సమయం వృథా అవుతోంది. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భవన నిర్మాణ కార్మికులతో పాటు దినసరి పనులు చేసే అనేక మంది కూలీలకు ప్రత్యేకంగా ఒక స్థలం అంటూ లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం సమయంలో రోడ్డుపై వచ్చి నిలుచుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాళీమందిర్ చౌరస్తా ప్రధాన రహదారిపై పని ఉందా అంటూ వచ్చిపోయే వారిని అడుగుతూ రోడ్డుపైనే అడ్డా కూలీలు అడ్డా వేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర మవుతుంది.

రోడ్డుపైనే వ్యాపారాలు..

దీనికి తోడుగా కాళీమందిర్ చౌరస్తాలో తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు జరిపే వారు కూడా రోడ్డుపైనే వ్యాపారాలు పెట్టడంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. పండ్లు విక్రయాలు తదితర వ్యాపారాలు రోడ్డుపై జరపడంతో ఈ రహదారిలో తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పాడి పలు ప్రమాదాలకు దారి తీస్తుంది.

రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ జామ్..

రోజు రోజుకూ ఇక్కడ నిర్మాణాలు భారీగా పెరుగుతుండటంతో అదే రీతిలో దినసరి కూలీలు కూడా కాళీమందిర్ ప్రాంతంలో బాగానే నివాసముంటారు. రోజు కూలీ పనులు చేసుకొనే భవన నిర్మాణం, పెయింటింగ్, సెంట్రింగ్ తదితర పనులు చేసుకుంటూ జీవనంసాగించే దినసరి కూలీలు ఉదయం సమయంలో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.



గతంలో కూలీలతో మాట్లాడుతున్న ట్రాఫిక్ అధికారులు (ఫైల్)

గతంలో అడ్డాను మార్చినా ఫలితం మాత్రం శూన్యం..

నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులు గతంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రోడ్డుపైన కూలీలు నిలవకుండా వారితో మాట్లాడి లేబర్ అడ్డాను రోడ్డు పక్కల గల బ్రాడ్‌వే ఏరియాలోకి అడ్డాను మార్చారు. కూలీలు రోడ్డు దాటేందుకు వీలుగా అక్కడ టెలికాన్ సిగ్నల్ కూడా ఏర్పాటు చేశారు. కానీ అడ్డా కూలీలు మాత్రం బ్రాడ్‌వేలోని ప్రాంతంలోకి వెళ్లడం లేదు. రోడ్డుపైనే ఉండి ట్రాఫిక్‌జాం చేస్తున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ సిబ్బంది..

రోజువారి కూలీలు రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు గతంలో రోజువారి కూలీలకు ఏర్పాటు చేసిన బ్రాడ్‌వే ఏరియాలో ఉండేవిధంగా తగు చర్యలు చేపట్టాల్సిందిగా, తోపుడు బండ్ల విక్రయదారులను రోడ్డుపై రాకుండా చూడాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వర్చువల్‌గా పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ



ఉందానగర్ రైల్వేస్టేషన్ పనులు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ
- రూ.12.5 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 రైల్వే స్టేషన్‌లు అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లుగా ఎంపికైన వాటిలో ఒకటైన ఉందానగర్ (శంషాబాద్) ఆధునీకరణ పనులను భారత ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రైల్వే డివిజనల్ మేనేజర్ లోకేష్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్‌లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతుందన్నారు. త్వరలోనే ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో అన్ని రకాల ఏర్పాట్లు కానున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు అజయ్, శ్రీకాంత్‌యాదవ్, సంజయ్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, బుక్కవేణుగోపాల్, దేవేందర్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .



రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సమస్యలపై విన్నపం..

ఉందానగర్ రైల్వేస్టేషన్ పేరును శంషాబాద్‌గా మార్చడంతో పాటు అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉందానగర్‌లో ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డివిజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా తత్కాల్ సౌకర్యం కూడా కల్పించాలన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంజూరైన రైల్వే స్టేషన్ కూడా త్వరగా నిర్మాణం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



డ్వాక్రా గ్రూపు మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మణికొండ: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోకాపేటలోని డ్వాక్రా భవనంలో సయోధ్య హోం ఫర్ ఉమెన్ ఇన్ నీడ్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల సహకారంలో మహిళలకు వంటలలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆయన కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసించే ఐటీ, ఇతర రంగాల్లో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఇంట్లో తయారు చేసిన వంటకాలను ఎక్కువ డబ్బు ఇచ్చి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, డ్వాక్రా గ్రూపు మహిళలంతా కలిసి ఓ వంటశాలను ఏర్పాటు చేసుకుని స్విగ్గీ లాంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వాటిని విక్రయిస్తే ఆర్థికంగా రాణించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ మహిపాల్, ఆయా సంస్థల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

మూగ జీవాలను ఆదుకోవాలి

మణికొండ: రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మూగ జీవాలకు తాగునీరు, ఆహారం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మణికొండ ఎనిమల్ రిస్క్ గ్రూప్ వలంటీర్లు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న వంద నీటి తొట్టిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల సంఖ్య పెరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటికి సకాలంలో ఆహారం నీరు అందితే ప్రజలతో ప్రేమగా ఉంటాయన్నారు. నీటి తొట్టెల్లో సమీపంలో ఉన్న వారు నీటిని నింపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి నవీన్‌తో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.



తొట్టిలో నీళ్లు పోస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

ఎంజీఐటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ ద్వారా విద్యార్థులు రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించి ఉద్యోగాల్లో జరిగే పోటీల్లో ముందు వరుసలో నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సు వారం రోజుల పాటు కొనసాగుతుందని, విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న సంస్థ, ఎంజీఐటీ ప్రతినిధులు

కాలనీల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌ను కలిసిన మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

మణికొండ: కాలనీల్లో ఉన్న రోడ్లు, మురుగునీరు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, అభివృద్ధి తదితర సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను హుడా కాలనీ, మారుతీనగర్ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌గా నియమితులైనందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో కలిసి ఆయనను సన్మానించి తమ కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. త్వరలోనే కాలనీల వారీగా పర్యటించి సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ ఎల్. వందన నగేష్, హుడా కాలనీ సంక్షేమ సంఘం, మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి అత్యంత శక్తివంతమైనది

బండ్లగూడ: స్త్రీ శక్తి అన్ని శక్తుల్లో అత్యంత శక్తివంతమైనదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని కేకే కన్వెన్షన్‌లో సోమవారం మహిళా శక్తి సమేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వం వహించే చోట ఫలితాలు ఎంతో ప్రయోజకరంగా ఉంటాయని తెలిపారు. గత ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు అతిథ్యం ఇచ్చిందన్నారు. జీ 20 అతి ముఖ్యమైన అంశం జీ20 ఎంపవర్ అని, ఇది మహిళలపై దృష్టి సారించిందని తెలిపారు. జీ 20 దేశాలలో మహిళా సాధికారిత సమూహాలు ఉన్నాయని తెలిపారు. మహిళా శ్రామిక శక్తిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. జీ 20 సాధికారతకు చైర్‌గా ఉన్నానన్నారు. కష్టపడి పని చేసే మహిళలను ఆదుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సంగీతారెడ్డి

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

మణికొండ: సమస్యల పరిష్కారానికి పరిశోధనలు ఎంతో అవసరమని, వాటికి ప్రభుత్వాలు చాలా నిధులు ఖర్చు చేస్తున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టిపెట్టినపుడే జీవితంలో రాణిస్తారని డిఫెక్ట్ మెటలాజికల్ రీసెర్చ్, లాబరేటరీ(డీఎంఆర్ఎల్) డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ ఆర్.బాలమురళీ కృష్ణన్ అన్నారు. గండిపేటలో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం నుంచి జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ సుధీ-2024 ప్రారంభమయ్యింది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం స్థిరత్వం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన, పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను యువ ఇంజినీర్లు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ ఎం.కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సవాళ్లను స్వీకరించి వాటికి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్‌లతో విద్యార్థులు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవటంతో పాటు ఇతరుల నైపుణ్యాలను తెలుసుకోవడం, తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టుకునేందుకు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుధీ-2024 చైర్మన్ ప్రొఫెసర్ పి.ప్రభాకర్ రెడ్డి, విద్యార్థి సంఘం అధ్యక్షుడు దృష్‌సక్సేనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీబీఐటీలో సుధీ-2024 ప్రారంభోత్సవంలో అతిథులు

కల్యాణం.. కమనీయం



మణికొండ: కామేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీలోని శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వర స్వామి ఆలయం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం సూర్య నమస్కారం, చండీ పారాయణం, శ్రీ కామేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి అష్టోత్తర శత కలశాభిషేకం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గణపతి హోమం, ఆయుష్యహోమం, రుద్రహోమం, లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను నిర్వహించారు. వేద మంత్రోశ్చరణలతో సెక్రటేరియట్ కాలనీ మారుమ్రోగుతుంది.

సెల్‌ఫోన్ అప్పగింత

శంషాబాద్ రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితుడుకి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ననాజీపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ రూ.30వేల విలువ చేసే మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఎస్ఐ రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ లింగమూర్తి మొబైల్ ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడికి అందజేశారు.

ఘనంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బండ్లగూడ: చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మెరిట్, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. పాఠశాలల విద్యార్థుల మధ్యలో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్‌యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి, సామాజికవేత సరోజ్ బజార్, కొండ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై రూపొందించిన ప్రత్యేక పాటను ఆవిష్కరించి రాజకీయ, సామాజిక జీవితానికి సంబంధించిన వీడియో డాక్యుమెంటరీని అభిమానులు ప్రదర్శించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శుభాకాంక్షల వెల్లువ..

శంషాబాద్ రూరల్: విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఆయనకు సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు నవారు కల్యాణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు సన్మానం



రాజేంద్రనగర్: వనస్థలిపురంలో ఆత్మీయ సత్కారంలో పాల్గొన్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డిని సోమవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జాతీయ అగ్రికల్చర్ బోర్డు మెంబర్ వానివల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కాంతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఉపేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డి.రవికుమార్, జి.వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి



ఏజీవర్సిటీ: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సిబ్బందికి క్రీడలను సోమవారం ప్రారంభించారు. క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగుపడేలా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

శంషాబాద్: జర్నలిస్టుల రైల్వేపాసులను పునరుద్ధరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం రైల్వే డివిజన్ మేనేజర్ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోవిడ్‌ సమయం నుంచి జర్నలిస్టుల రైల్వే పాసులు కొనసాగడం లేదని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు దేవేందర్, భానుగౌడ్ ఆయనకు విన్నవించారు. వృత్తి సంబంధిత పనుల్లో వేలాది మంది జర్నలిస్టులు పాసులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర సర్కారు దృష్టికి తమ విన్నపాన్ని తీసుకెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సుదర్శన్, చారీ, శ్రీనివాస్, గోపాల్ తదితరులున్నారు.



నియామకం

మణికొండ: మున్నూరు కాపు జర్నలిస్ట్ జిల్లా కన్వీనర్‌గా మణికొండకు చెందిన జి.విజయ్‌కుమార్‌ను నియమించారు. సోమవారం రాష్ట్ర మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం(టీఎంకేజేఎఫ్) వ్యవస్థాపకుడు కొత్తా లక్ష్మణ్ పటేల్ ఈ మేరకు నియామకపు ఉత్తర్వులు జారీ చేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. గండిపేట మండలానికి విలేకరిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ మున్నూరు కాపు విలేకర్ల శ్రేయస్సు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని నియమించాలన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పూర్తి స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు.

నర్సరీలను సందర్శించిన ఉద్యాన వన విద్యార్థులు



ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన వన విశ్వవిద్యాలయం విద్యార్థులు కోర్సులో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ జీడిమెట్ల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ములుగు, గ్రోమోర్ నర్సరీ ములుగును సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్విన్‌కుమార్, డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఈ సందర్భంగా వివిధ కూరగాయల మొక్కల ఉత్పత్తి వాటి పరిరక్షణ చర్యలపై వివరించారు. దీంతో పాటు నారుమళ్లల్లో చేపట్టాల్సిన వివిధ ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను పాలీహౌస్, షెడ్ నెట్, టన్నెల్‌లలో నర్సరీల మొక్కలను పెంచే విధానాన్ని ఉష్ణాగత తేమ శాతాన్ని సేంద్రియ ఎరువులను విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని వాటికి తగు రీతిలో విత్తన శుద్ధిని అవలంభించాలని సూచించారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయాలకు గురయ్యాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై చోటు చేసుకుంది. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లేందుకు పీవీ నరసింహ రావు ఎక్స్‌ప్రెస్ వే నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటల ప్రాంతంలో ఓ వ్యక్తి కారులో వెళ్తున్నాడు. వేగంగా దూసుకొచ్చిన ఆ వాహనం పిల్లర్ నంబర్ 296 వద్దకు రాగానే అదుపుతప్పి పల్టీ కొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ ఘటన సమయంలో అటు ఇటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనంలోని బెలూన్‌లు ఓపెన్ కావడంతో వాహనం నడిపిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని స్థానికుల సాయంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. సాయంత్రానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

శంషాబాద్: పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ..కోనోకార్పస్ చెట్లను శాస్త్రవేత్తలు తొలగించాలని సూచించినప్పటికీ ఆయా స్థానిక సంస్థల అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లక్షల సంఖ్యలో ఉన్న కోనోకార్పస్ చెట్ల వల్ల మానవాళికే కాకుండా జంతువులకు సైతం ప్రమాదం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన చెట్లకు కాసిన విత్తనాలతో మరిన్ని చెట్లు పెరుగుతున్నాయన్నారు. తొలగించాలని ప్రభుత్వం సూచించినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230